సాక్షి
పల్నాడు
సోమవారం । 26 ఫిబ్రవరి । 2024



వెండి బిందె, కిరీటం వితరణ

అచ్చంపేట: స్వయంభు సత్తెమ్మతల్లికి కోటప్పకొండ దేవస్థాన కమిటీ మెంబరు దివ్వెల రామకృష్ణ వెండి బిందె, కొత్త హరినాథబాబు వెండి కిరీటాన్ని విరాళంగా సమర్పించారు.



భావనారుషి కల్యాణం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.



అన్నదానానికి విరాళం

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

రేపు హెల్త్ ఉద్యోగులకు స్పెషల్ గ్రీవెన్స్

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులందరి వేతన సంబంధిత సమస్యలపై మంగళవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. వేతన సంబంధిత సమస్యలున్నవారు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పని వేళల్లో లిఖిత పూర్వకంగా తగు ఆధారాలతో డీఎంహెచ్‌ఓను సంప్రదించాలన్నారు.

మార్చి 6న పాతకోటయ్య మెట్లమార్గానికి భూమిపూజ



నరసరావుపేట: కోటప్పకొండలో పాత కోటయ్య సన్నిధికి చేరేందుకు 3700 మెట్లతో నిర్మించబోయే మెట్ల మార్గానికి మార్చి ఆరో తేదీన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భూమిపూజ నిర్వహిస్తారని మెట్ల మార్గ నిర్మాణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగుల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మెట్ల మార్గ కమిటీకి చెందిన 10మంది కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని ఆయన గృహంలో కలిసి భూమిపూజకు ఆహ్వానించారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కార్యదర్శిగా ఇండ్ల కోటేశ్వరరావు, కోశాధికారిగా కొత్తూరి గోపి, ఉపాధ్యక్షులుగా తేళ్ల సుధీర్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, బత్తుల విష్ణు, సంయుక్త కార్యదర్శులుగా తాళ్ల వెంకటకోటిరెడ్డి, చిన్ని శ్రీనివాసరావు, మెంబర్లుగా వేముల వెంకటనారాయణ, దివ్వెల సురేష్‌కుమార్‌లతో నూతన కమిటీ ఏర్పాటైందన్నారు. దాతలు ప్రతి మెట్టుకు రూ.20వేలు చొప్పున ఐదు మెట్లకు రూ.లక్ష చెల్లిస్తే వారి పేరు ఆ మెట్లపై ముద్రిస్తామని తెలిపారు. కావున దాతలు నిర్మాణానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హాలీవుడ్ రఘు పాల్గొన్నారు.

నేడు రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన

నరసరావుపేట: అమృత భారత్ పథకం కింద గుంటూరు డివిజన్‌లోని 13 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన, పది ఆర్‌యూబీ, అండర్ పాస్‌ల ప్రారంభోత్సవాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వే డివిజన్ మేనేజర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేట, మంగళగిరి, సత్తెనపల్లి, నడికుడి, మాచర్ల, మిర్యాలగూడ, నల్గొండ, వినుకొండ, మార్కాపురం రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల స్టేషన్లలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.


తెనాలిలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన

వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోదీ



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌కు ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. జిల్లా వైద్యశాలలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు పాల్గొన్నారు. సెకండరీ హెల్త్ విభాగం జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుబ్రమణ్యారాజు, డీఈఈ వెంకటరత్తయ్యలు మాట్లాడుతూ తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం కోసం రూ.44.05కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం వెచ్చించినట్లు చెప్పారు. నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి వారికి చికిత్స అందించేందుకు క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, ఏఓ డాక్టర్ మజీదా బేగం, డాక్టర్ మనుమోహన్, డాక్టర్ శ్రావణ్‌బాబు, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 516.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 816.20 అడుగుల వద్ద ఉంది.

భవన విజయం!



రూ.2.25కోట్లతో నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనం



రూ.1.50కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనం



గురుకుల పాఠశాల భవనం

ప్రభుత్వ భవనాలకు నూతన శోభ

- రూ.10కోట్లతో సకల సౌకర్యాలు
- పట్టించుకోని గత ప్రభుత్వం
- ఎమ్మెల్యే నంబూరు ప్రత్యేక చొరవ
- ఉద్యోగులు, ప్రజలు హర్షాతిరేకం

గతంలో...

చాలీచాలని గదులు..చెట్ల కిందనే విద్యా బోధన... ఎప్పుడు కూలుతాయో తెలియని ప్రభుత్వ కార్యాలయాలు.. వర్షం కురిస్తే ఫైళ్లు ఎక్కడ భద్రం చేయాలో తెలియని దుస్థితి. పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ గతంలో మంత్రిగా పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణగాని, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌గాని ఎన్నడూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రస్తుతం...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రత్యేక చొరవతో పరిస్థితి మారింది. కోట్లాది రూపాయలతో పాఠశాలలను తీర్చిదిద్దారు. నూతన భవనాలు నిర్మించారు. ప్రభుత్వం కార్యాలయాలను ఆధునీకీకరించారు. దీంతో అచ్చంపేట మండల ప్రజలు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అచ్చంపేట: బ్రిటిష్‌వారి కాలంలో నిర్మించిన భవనంలోనే ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తూ వచ్చారు. అందులో ఏ వసతులు లేవు. సబ్ ఇన్‌స్పెక్టర్‌కు ప్రత్యేక గదిలేదు. వరండానే రెండు గదులుగా విభజించి అందులో ఒకటి ఎస్‌ఐకు, రెండోది కంప్యూటర్ గదిగా వినియోగించేవారు. ఖైదీలకు ప్రత్యేక గదులు లేవు. మధ్య హాలులోనే వుంచేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.2.25కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నూతన భవనం నిర్మించారు. స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయించి నూతనంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. 24/7 సిబ్బంది పనిచేసే విధంగా సౌకర్యాలు కల్పించారు.

బోధనకు తొలగిన ఇబ్బందులు

స్థానిక జెడ్పీ హైస్కూలులో సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులను చెట్ల క్రింద కూర్చోబెట్టి పాఠాలు బోధించేవారు. ఇటీవల రూ.1.85లక్షలతో ఎనిమిది గదులతో భవనాన్ని నిర్మించారు. మరో ఎనిమిది గదుల భవనం నిర్మాణ దశలో ఉంది. ఇప్పుడు సరిపడా తరగతులు ఉండటంతో అందుకు అనుగుణంగా విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది.

వైద్యానికి తీరిన తిప్పలు

గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సక్రమంగా ఉండేవారు కాదు. శిథిలావస్థలో ఉన్న భవనంలోనే ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్సులు వైద్యం చేసేవారు. సరిపడా మందులు ఉండేవికావు. ల్యాబ్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉండేది. అత్యవసర పరిస్థితులలో ఆపరేషన్ చేయాలంటే పరికరాలు లేక పోవడంతో సత్తెనపల్లి తరలించేవారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రూ.1.50తో నూతనం భవనాన్ని నిర్మించారు. నలుగురు డాక్టర్లను నియమించారు. 67 వైద్య పరీక్షలు చేసే విధంగా ప్రత్యేకంగా లేబొరేటరీని ఏర్పాటుచేసి, సుమారు రూ.20 లక్షల విలువచేసే అత్యాధునిక పరికరాలను ఏర్పాటుచేశారు. మహిళల కోసం మహిళా వైద్యురాలిని నియమించారు.

ప్రత్యేకంగా బాలికల జూనియర్ కళాశాల

స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలను గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ భవనాన్ని మాత్రం మంజూరు చేయలేదు. దీంతో హైస్కూలులోనే ఇంటర్మీడియట్ తరగతులను కూడా నిర్వహించేవారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.1.63కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేయించారు. ఇప్పుడు ఈ కళాశాలలో సరిపడా తరగతి గదులు, హాస్టల్ వసతి కల్పించడంతో 200మందికి పైగా బాలికా విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

గురుకులానికి అదనపు హంగులు

స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను గతంలోనే జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రత్యేకంగా భవనాలు కేటాయించకపోవడంతోనే పాఠశాలలోనే కళాశాలను కూడా నిర్వహిస్తూ వచ్చారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎనిమిది అదనపు తరగదుల నిర్మాణానికి రూ.1.85 కోట్లు మంజూరు చేయించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించారు. ఇప్పుడు ఇక్కడ సుమారు 700మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

ఆహ్లాదంగా అతిథి గృహం

స్థానిక జెడ్పీ అతిథి గృహంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. ఎమ్మెల్యే శంకరరావు, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డిల కృషి ఫలితంగా రూ.25లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేయించి ఆధునికీకరించారు.

అచ్చంపేట చరిత్రలో ఇంత అభివృద్ధి జరగలేదు



ఒక మండల కేంద్రంలో ఈ స్థాయి అభివృద్ధి ఎక్కడా జరిగి ఉండదు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలు సైతం నూతన భవనాలు రావడంతో సమసిపోయాయి. ఎమ్మెల్యే శంకరరావు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని అనుసరిస్తూ విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు.

– అన్నవరపు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు, అచ్చంపేట

దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారం



కరోనా వంటి విపత్కర పరిస్థితులొచ్చిన అచ్చంపేటలో అభివృద్ధి పనులు ఆగలేదు. ఇప్పుడు నిర్మించిన పీహెచ్‌సీ కార్పొరేట్ స్థాయిలో ఉంది. అన్ని వైద్య పరీక్షలు చేస్తున్నారు. రాజీవ్‌నగర్ కాలనీ దశాబ్దాలుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం చూపారు. కాలనీలోని అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించి, సైడ్ డ్రైన్స్ కట్టించారు.

– పోసిపోగు కోటయ్య, డ్రైవర్, మాదిపాడు



నరసరావుపేటలో గ్రూప్-2 పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జేసీ శ్యాంప్రసాద్

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు
- 9,778 మంది అభ్యర్థులకు 8,323మంది హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్–2 పరీక్ష పల్నాడుజిల్లా పరిధిలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. నరసరావుపేటలో 25, సత్తెనపల్లిలో 2, చిలకలూరిపేటలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షకు 9,778మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 8,323మంది హాజరయ్యారు. మరో 1455మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద ఉదయం 9.30గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లకుండా అభ్యర్థులను పూర్తి తనిఖీ చేసి అనుమతించారు. పట్టణంలోని పలు కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. జేసీ వెంట జిల్లా ఇన్‌ఛార్జ్ రెవెన్యూ అధికారి అజయ్‌కుమార్ ఉన్నారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతుల ఏర్పాట్లపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

‘సిద్ధం’.. విజయవంతం చేద్దాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- సత్తెనపల్లిలో సన్నాహక సమావేశం



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయటంలో భాగంగా నిర్వహిస్తున్న సిద్ధం నాలుగో సభ మార్చి మూడో తేదీన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల వద్ద పిచ్చుకల గుడిపాడులో జరగనుందని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం పార్టీ ముఖ్య నాయకులతో సిద్ధం సభకు జనసమీకరణలో భాగంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ నాల్గవ సిద్ధం సభ విజయవంతానికి సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి నుంచి భారీ స్థాయిలో జన సమీకరణ చేయాలన్నారు. ప్రతి గ్రామం నుంచి సాధ్యమైనంతకు మేరకు క్రియాశీలక కార్యకర్తలను తరలించాలని ఆయన నాయకులకు సూచించారు. వాహనాలు వసతులు, ఏర్పాట్లపై చర్చించారు. ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. సిద్ధం సభ విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ నెల 27వ తేదీన రాజుపాలెం మండలం ఉప్పల పాడు గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవం అనంతరం జరిగే బహిరంగ సభ పై కూడా ఆయన ఆ మండల నాయకులతో చర్చించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, బాసు లింగారెడ్డి, పార్టీ రాజుపాలెం మండల అధ్యక్షుడు వేపూరి శ్రీనివాసరావు, నాయకులు మర్రి సుబ్బారెడ్డి, తోట లక్ష్మీనారాయణ, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

కార్తికేయుని సన్నిధిలో భక్తుల కోలాహలం



నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో తెలుగు ఉభయ రాష్ట్రాలతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు

ప్రైవేట్ బడుల్లో పేదలకు కోటా

- ప్రైవేటు స్కూళ్లలో 25శాతం సీట్ల కేటాయింపు
- 2024–25 విద్యాసంవత్సరానికి నోటిఫికేషన్ జారీ
- ఒకటో తరగతిలో చేరికకు ఆహ్వానం
- మార్చి 5 నుంచి అందుబాటులోకి పోర్టల్



తరగతి గదిలో విద్యార్థులు



ఎం వెంకటేశ్వర్లు, డీఈఓ, పల్నాడు


యడ్లపాడు/సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తోంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారితోపాటు అనాథ, దివ్యాంగులకు రిజర్వేషన్ల ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. వీరి ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే భరించి కార్పొరేట్ స్కూల్లో ఉచిత విద్యను అందిస్తుంది. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సి) ద్వారా గతేడాది 259 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించగా, తాజాగా 2024–25లో ప్రవేశాలకు పాఠశాల విద్యా శాఖ నోటిఫికేషన్ జారీ అయింది. పల్నాడు జిల్లాలో ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్లు 361 ఉన్నాయి. ఇందులో ప్రైమరీ 161, యూపీ 182, ఉండగా మిగిలినవి ప్రైమరీ నుంచి హైస్కూల్స్ వరకు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో నమోదు.. లాటరీ ద్వారా ఎంపిక

ఐదు నుంచి ఆరేళ్ల వయస్సు కలిగిన పిల్లలు ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో ఈ ఉచిత ప్రవేశాలకు అర్హులు. http://cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టుకోవాలి. ఇందుకు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉండాలి. విద్యార్థులు ఆధార్‌లోని చిరునామా ప్రామాణికంగా వారి ఇళ్లకు సమీపంలోని పాఠశాలలకు మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ఆ తర్వాత మూడు కి.మీ పరిధిలోని పాఠశాలలకు కేటాయిస్తారు. మార్చి 5 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. వీటిని రాష్ట్రస్థాయి అధికారులే పరిశీలన చేసి అర్హులను గుర్తించి లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక చేసి అడ్మిషన్ వివరాలు ప్రకటిస్తారు.

దుర్గమ్మ సన్నిధిలో విద్యార్థుల సందడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. మరో నాలుగు రోజులలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థుల వార్షిక పరీక్షల నేపథ్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తమ పరీక్ష హాల్ టికెట్లను అమ్మవారికి చూపి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా దీవించమని వేడుకున్నారు. మరో వైపున నవ వధూవరులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల తాకిడి కనిపించింది. ఆదివారం కావడంతో అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాలలో విశేషంగా ఉభయదాతలు పాల్గొన్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్ రోడ్డు, మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు.



అమ్మవారికి హాల్ టికెట్లను చూపుతున్న ఇంటర్ విద్యార్థులు

క్లుప్తంగా

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరు ఏకేఎంఆర్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు కరస్పాండెంట్ పట్రా యాలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేశ్వర్లు, కే పద్మావతమ్మలను ఈనెల 22వ తేదీన సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు పలుమార్లు వివరణ కోరుతూ మెమోలు జారీ చేసినా స్పందించలేదని అందుకే సస్పెండ్ చేసినట్లు వివరించారు. విధుల నుంచి తొలగించిన అనంతరం తమను పాఠశాలలోకి అనుమతించాలని గేటు వద్ద కూర్చొని తనను ఇబ్బంది పెడుతున్నారని ఆ ప్రకటనలో తెలిపారు.

రవాణాశాఖ సాంకేతిక అధికారుల సంఘ కార్యవర్గం

పటమట(విజయవాడతూర్పు): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవాణా శాఖ సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గాప్రసాద్ రెడ్డి ప్రకటించారు. సంఘం ఎన్నికలు బెంజ్‌సర్కిల్ సమీపంలో ఒక హోటల్లో ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎన్జీఓ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్ వ్యవహరించారు. రాష్ట్ర సంఘానికి నూతన కార్యవర్గంలో 27 పదవులకు 26 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక జరిగింది. 56 ఓట్ల ఆధిక్యతతో ఆర్.ప్రవీణ్ గెలుపొందారు. అధ్యక్షుడిగా టి.దుర్గాప్రసాద్‌రెడ్డి, సహాధ్యక్షులుగా వై.పూర్ణచంద్రరావు, వై.ప్రసాద్, టి.వి.ఎస్.సుబ్బారావు, జి.సత్యంనాయుడు, ఉపాధ్యక్షులుగా జి.తిమ్మరుసు నాయుడు, జి.భాస్కరరావు, జి.నాగమురళి, ఆర్.సుధీర్, కార్యనిర్వాహక కార్యదర్శి సహా ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారిగా సీహెచ్ రాంబాబు సహా ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వి.శివారెడ్డి, ఎన్జీఓ సంఘం రాష్ట్ర కోశాధికారి రంగారావుతో పాటు సంఘంలోని వివిధ జేఏసీల నాయకులు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పట్ల వేగంగా స్పందిస్తానని, మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని దుర్గాప్రసాద్‌రెడ్డి చెప్పారు.

పేదల పక్షాన నిలిచే వైఎస్ జగన్‌దే విజయం

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు


రుద్రవరం గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

రుద్రవరం(ముప్పాళ్ల): పేదలకు, పెత్తందార్లకు మధ్య ఈ యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే విజయమని, ఆయనను దించటం ఎవరి వల్ల కాదని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని రుద్రవరంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, అమ్మ ఒడి, రైతు భరోసా సాయం, వలంటీరు వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయం వస్తుండటంతో మరలా మోసం చేసేందుకు చంద్రబాబు మోసపూరిత హామీలతో ముందుకు వస్తున్నాడని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మ ఒడిని చూసి అమ్మకు వందనం పేరుతో ప్రజలను ఏమార్చాలని చూస్తున్నాడని ఆరోపించారు. మోసం చేయటం చంద్రబాబు లక్షణమైతే, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్షణమని గుర్తు చేసుకోవాలని కోరారు. ప్రతి పేదవానికి మేలు చేయాలని తాపత్రయ పడుతూ వారికి అండగా ఉండాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉంటే చాటు సంక్షేమ పథకం పొందేందుకు అర్హులేనని భావిస్తూ రూ.2లక్షల62 వేల కోట్ల రూపాయలు బటన్ నొక్కి అర్హులకు నేరుగా సంక్షేమ లబ్ధి అందించిన ఏకైక ముఖ్యమంత్రిగా వివరించారు. చంద్రబాబు తన 14 సంవత్సరాల పాలనలో ఒక్క మంచి పని చేసి ఉంటే ధైర్యంగా చెప్పాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత లబ్ధి పొందిన ప్రతి ఓటరుపై ఉందని అన్నారు. పేదలకు పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధంలో పేదలదే విజయమని, పేదల పక్షాన నిలబడే వైఎస్సార్ సీపీ 175 సీట్లలో విజయం సాధించి భారతదేశంలో చరిత్ర సృష్టించనున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ యుద్ధాన్ని చూసి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పారిపోవాల్సిందేనన్నారు.

ముఖ్యమంత్రి ఎవరో పునరాలోచించుకోవాలి....

రాష్ట్రంలో ఇద్దరే ముఖ్యమంత్రులుగా పోటీ పడుతున్నారని, అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక రైతే, మరొకరు మాట తప్పే చంద్రబాబు నాయుడు, కాపులు అనుకుంటున్నట్లుగా పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కాదని, ముష్టి 24 సీట్ల కోసం చంద్రబాబు పల్లకి మోసేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధమయ్యాడన్నారు. గతంలో ఇదే మాట చెప్పానని, ఇప్పుడు కూడా చెబుతున్నానని, పవన్‌కళ్యాణ్ రాజకీయాలకు పనికిరాడన్నారు. ఎవర్నో గద్దె దించడం కోసం పార్టీలు పెట్టడం రాజకీయాల్లో ఇదే ప్రథమం అని చెప్పారు. కాపులు పునరాలోచించుకోవాలని, పవన్‌కళ్యాణ్ మాట విని చంద్రబాబుకు ఓటేస్తే అంతే సంగతులని హెచ్చరించారు. ఆ తర్వాత ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచినట్లే పొడుస్తాడని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ మోసపోతున్నాడని, ఆయన వెనక ఉన్న వారు కూడా మోసపోతున్నారు.. అందర్నీ కలిసి చంద్రబాబు ముంచేస్తాడు అని చెప్పారు. రాబోయే ఎ గెలిపించి ముఖ్యమంత్రిగా వైయస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా సచివాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందించిన వారిని అభినందించి సన్మానించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. తొలుత మహాత్మాగాంధీ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, సర్పంచి రాప్రోలు వెంకటకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కళ్లం వీరభాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచి గున్నం పెద్దిరెడ్డి, శివకోటిరెడ్డి, పున్నారెడ్డి, గున్నం కృష్ణారెడ్డి, కేశవ్, అగస్టియన్‌బాబు పాల్గొన్నారు.

తోడు దొంగలకు ప్రజలే బుద్ధి చెబుతారు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- బూత్ కమిటీ సభ్యులతో సమావేశం


మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: అద్దంకి తోడుదొంగలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, ఇటీవల పార్టీ మారిన బాచిన కృష్ణచైతన్యలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల బూత్ కమిటీ, గృహ సారథులు, సర్పంచ్‌లు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హనిమిరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు పార్టీని, నియోజకవర్గాన్ని నాశనం చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం పేదలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలు పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రతిపక్షాలు ఎంతమంది వచ్చినా ఏమీ చేయలేరన్నారు. పార్టీ మారిన వ్యక్తి కార్యకర్తలను బెదిరిస్తున్నారని, ఏ ఒక్క వైఎస్సార్ సీపీ కార్యకర్త బెదిరిపోరన్నారు. వచ్చే ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచి ప్రత్యర్థులను కోలుకోలేని దెబ్బకొడతామన్నారు. జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాల నగదు చంద్రబాబు నాయుడు కాలంలో ఏమైందని అందరూ ఆలోచించాలన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడిన వారిని గుర్తించి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అద్దంకిలోని వైఎస్సార్ సీపీ గెలుపును జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందిస్తానన్నారు. పార్టీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల అధ్యక్షుడు పానెం శ్రీనివాసరెడ్డి, జజ్జర ఆనందరావు, అవిశెన ప్రభాకరరెడ్డి, గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అవసరం

ఏపీ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు


మాట్లాడుతున్న చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు

కొరిటెపాడు(గుంటూరు): స్థిరమైన ఆర్థికాభివృద్ధి, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన కోసం ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం చాలా అవసరమని ఆంధ్రప్రదేశ్ చాంబర్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపురంలోని స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ చాంబర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మహిళా పారిశ్రామికవేత్తలతో ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం నిర్వహించారు. భాస్కరరావు మాట్లాడుతూ భారతదేశంలో మహిళల ఆర్థిక సహకారం జీడీపీలో 17 శాతం ఉందని, ఇది ప్రపంచ సగటు కంటే తక్కువ అని వెల్లడించారు. వర్క్‌ఫోర్స్‌లో 50 శాతం మహిళల్ని చేర్చుకోవడం ద్వారా భారతదేశం జీడీపీ వృద్ధిని 1.5 శాతం పెంచుతుందని ప్రపంచబ్యాంక్ నివేదించిందని తెలిపారు. మెకిన్స్ గ్లోబల్ ఇనిస్టిట్యూట్ అంచనా ప్రకారం 2025 నాటికి 68 మిలియన్ల మహిళల్ని శ్రామిక శక్తిలోకి తీసుకురావడం ద్వారా భారతదేశం జీడీపీని యుఎస్‌డీ 700 బిలియన్లకు పెంచగలదని అంచనా వేసిందని పేర్కొన్నారు. దేశంలో 63 మిలియన్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 20 శాతం మహిళల యాజమాన్యం, 22 నుంచి 27 మిలియన్ల మందికి ఉపాధి లభిస్తోందని వివరించారు. దేశంలోని అన్ని సంస్థల్లో మహిళలకు 20 శాతం మాత్రమే ఉన్నాయన్నారు. ఈ మహిళా నేతృత్వంలోని ఎంటర్‌ప్రైజెస్‌లో 82 శాతం మైక్రో యూనిట్లు ఏకైక మార్గాలుగా నడుస్తున్నాయని వెల్లడించారు. మహిళలకు సాధికారత కల్పించి, వారిని ఆర్థికాభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో గుంటూరు, ఇతర జిల్లాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలతో గుంటూరులో మహిళా విభాగాన్ని ఒక చాప్టర్‌గా ప్రారంభించేందుకు ఏపీ చాంబర్స్ చొరవ తీసుకుందని వివరించారు. విశాఖపట్నంలోని మహిళా విభాగం 110 మంది మహిళా పారిశ్రామికవేత్తలతో గత రెండు సంవత్సరాలుగా చురుకుగా పని చేస్తోందని తెలిపారు. వ్యాపార మహిళలు, వర్ధమాన వ్యాపారవేత్తలు, నిపుణులు మహిళా అధ్యాయంలో భాగం కావచ్చని కోరారు. కార్యక్రమంలో 40 మంది మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొని, అధ్యాయంలో భాగం కావడానికి ఆసక్తిని కనబరిచారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిత, డాక్టర్ మమత, రాధిక, అపర్ణ, రోజా, పూజ, నీలిమ, శరణ్య పాల్గొన్నారు.

మైనారిటీలపై చంద్రబాబుకి వివక్ష

- సీట్ల కేటాయింపులో బయటపడిన వైఖరి
- ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి



లక్ష్మీపురం: మైనారిటీపై చంద్రబాబు వివక్షత మరోసారి సీట్ల కేటాయింపుతో బయటపడిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి ధ్వజమెత్తారు. స్థానిక కంకరగుంట గేటు వద్ద గల రాష్ట్ర సమితి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం, జనసేన పార్టీ పొత్తులో భాగంగా 99 స్థానాల్ని ప్రకటించిన చంద్రబాబు అందులో ముస్లింలకు కేవలం ఒక్కటే కేటాయించడం దుర్మార్గమని ఖండించారు. 2014లో కూడా ఆయన ఒక్క స్థానం మాత్రమే కేటాయించినట్లు గుర్తు చేశారు. అనంతరం ఏర్పడిన మంత్రి వర్గంలో ముస్లింలకు అవకాశం కల్పించలేదని, నాలుగున్నర సంవత్సరాలు ముస్లిం మంత్రి లేకుండానే కొనసాగించారని గుర్తు చేశారు. చివరి ఆరు నెలలు ఎన్నికల ముందు ఫారుక్‌కు శాసన మండలి సభ్యునిగా అవకావమిచ్చి మంత్రి వర్గంలో చోటు కల్పించారని చెప్పారు. గుంటూరులో జరిగిన నారా హమారా... బాబు హమారా సభలో తమ డిమాండ్లు నెరవేర్చాలని ప్లకార్డులు చూపించిన ముస్లిం యువకులపై రాజద్రోహం కేసులు మోపడం సిగ్గుచేటని ఖండించారు. చంద్రబాబు వైఖరి మార్చుకోలేనందును 2024లో జరిగే ఎన్నికలలో మరలా ముస్లిం మైనారిటీలు చంద్రబాబుకు, పవన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయంలో ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు ముస్లింలకు తగినన్ని స్థానాలు ఇవ్వాలని, లేని పక్షంలో వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పల్నాడు ప్రజలకు ఇక మెరుగైన వైద్యం

- నేడు డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ హాస్పిటల్ మొదటి దశ ప్రారంభం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెల్లడి


ప్రారంభానికి సిద్ధమైన వంద పడకల హాస్పిటల్

పిడుగురాళ్ల రూరల్: పల్నాడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మండలం కామేపల్లి రెవెన్యూ పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ మొదటి దశ సోమవారం ప్రారంభించనున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజ్‌ని ఆదివారం సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పల్నాడుకు వైద్యకళాశాల అవసరముందని ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి కళాశాల మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. తొలి బడ్జెట్ సమావేశంలోనే మెడికల్ కాలేజీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.500 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. 2021లో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ,హాస్పిటల్‌కు శంకుస్థాపన చేశారు. రూ.180 కోట్లతో మొదటి దశగా వంద పడకల హాస్పిటల్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. 2024 సెప్టెంబర్ నాటికి పనులు అన్ని పనులు పూర్తి చేసి మరో 500 పడకల హాస్పిటల్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. 55 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో 12 లక్షల చదరపు అడుగుల్లో 600 పడకల హాస్పిటల్, మెడికల్ కాలేజి, నర్సింగ్ కాలేజి, లేబొరేటరీలు, ఆపరేషన్ థియేటర్లు, సిబ్బంది నివాస భవనాలు నిర్మాణాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.డి.గఫార్, మార్కెట్ యార్డు చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ సీహెచ్ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరావు, లాయర్ కంభంపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ఆస్పత్రి పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం

- మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్
- రవ్వవరం కొండగురునాథ స్వామి తిరునాళ్లకు హాజరు


సభలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రవ్వవరం కొండగురునాథ స్వామి తిరునాళ్ల సందర్భంగా స్వామిని నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ అభిమానులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలను సందర్శించారు. అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ తనకు నరసరావుపేట లోక్‌సభ సీటు కేటాయించారని, సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీలో సాధ్యమని అందుకు ఇదే నిదర్శనమన్నారు. పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం కేటాయించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతోందన్నారు. పల్నాడు జిల్లాలో మీ అండదండలతో ఏడు అసెంబ్లీ సీట్లతో పాటు ఎంపీ స్థానాన్ని గెలిపించాలని కోరారు. భక్తిశ్రద్ధలతో తిరునాళ్లకు ప్రభలను ఏర్పాటు చేసిన కార్యకర్తలను అభినందించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ప్రభలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొండ గురునాథుని ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వినుకొండ నియోజకవర్గాన్ని శక్తివంచన లేకుండా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

నిరంతర కృషితోనే లక్ష్య సాధన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వెన్నం జ్యోతి సురేఖ, వీసీ తదితరులు

- విలు విద్యలో అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ
- వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో ఘనంగా ముగిసిన విటోపియా- 2024

ఐనవోలు(తాడికొండ): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతి సురేఖ అన్నారు. తుళ్లూరు మండలంలోని వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా కొనసాగుతున్న విటోపియా- 2024 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోతి సురేఖ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిచ్చి ముందుకెళ్లడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విజయాలు సాధించవచ్చని తెలిపారు. విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో వారి ప్రతిభను వెలికితీసేందుకు ఏటా విటోపియా పేరిట వార్షిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలలో పాల్గొని, నైపుణ్యాల్ని వృద్ధి చేసుకునేందుకు వేదికగా మారుతుందని తెలిపారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాల్ని ప్రోత్సహించేందుకు, విద్య, పరిశోధనా రంగాలలో తమ విశ్వవిద్యాలయం అందిస్తున్న సహకారం, విద్యార్థుల ప్రతిభను వివరించారు. ఈ సందర్భంగా సమయ్ రైనా స్టాండప్ కామెడీ అందరినీ అలరించింది. సాయంత్రం జరిగిన ప్రో షోలో జోనిత గాంధీ బ్యాండ్, సలీమ్ అండ్ సులేమాన్ బ్యాండ్, డీజే ప్రోగ్రెసివ్ బ్రదర్స్ బ్యాండ్‌ల సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో వీఐటీ ఏపీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ సుధాకర్ ఇలంగో, విటోపియా స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ ఖాదీర్ పాషా, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ బస్సు బోల్తా..

విద్యార్థులకు స్వల్ప గాయాలు


వేమూరు పెట్రోలు బంక్ వద్ద బోల్తా పడిన స్కూల్ బస్సు

వేమూరు: ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కొల్లూరు మండల కేంద్రంలో వివేకానంద పాఠశాలల్లో క్రీడలు నిర్వహిస్తున్నారు. క్రీడాల్లో పాల్గొనేందుకు తెనాలి వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థులు 21 మంది, ఉపాధ్యాయులు మూడు బస్సులో కొల్లూరు పాఠశాలకు వెళ్లారు. అక్కడ ఆటలు పోటీలు ముగింపు అనంతరం కొల్లూరు నుంచి తెనాలి బయలు దేరారు. అతి వేగంగా నడపటంతో, వేమూరు పెట్రోలు బంక్ సమీపంలో ములుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులో బాలికలు 11 మంది, బాలురు 9 మంది, ఉపాధ్యాయులు 3 ఉన్నారు. బోల్తా పడిన వెంటనే రోడ్డు పై వెళ్తున్న ప్రయాణికులు బస్సు అద్దాలు పగలు కొట్టి బయటకు తీయడంతో స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.